ఇంటనొకటి రచ్చనొకటి

శ్రీమతి పి. హేమలతా దేవిగారు

రఘునాథరావు B. A. ప్యాసయినాడు. బ్రాహ్మణుడు తెలివిగలవాడు. యింకా యేమీ వుద్యోగము లేదు. Town halls లోగాని స్త్రీసమాజములలోగాని అతడు లేనిదే యేఉపన్యాసము జరుగదు. యీ దినమున స్త్రీసమాజములో రఘునాథరా వీవిధముగా ఉపన్యసించెను:

సోదరీమణులారా,

మనదేశములో స్త్రీలబాధలు చూస్తే రాయేనా కరిగిపోతుంది స్త్రీకి తనశరీరమునకు తనయిష్టమువచ్చిన దుస్తులు తనయిష్టప్రకారం ధరించుకొనుటకైనా స్వాతంత్ర్యము లేదు. యీవేళ శ్రావణ మంగళవారము, స్త్రీల ఖయిదు విడుదలదినము. "జన్మకల్లా యీవేళ వీధిలోనికి వస్తూన్నాము: యీవేళయిన యిష్టము వచ్చినట్లు మంచిదుస్తులు ధరించెదమంటే, ఆదుస్తులు యేలా ధరించవలెనో అత్తగారినో ఆడబిడ్డనో అడిగి వారియిష్టమువచ్చినట్లుగాని ధరించవీలు లేదు" అని అనేకమంది యువతులు లోలోన విచారించుచుందురు. అత్తగార్ల Fashion వేరు. కోడళ్ళ Fashion వేరు. కోడలు అత్తగారి అనుమతిప్రకారం దుస్తులు ధరించక పోతే వీధిలోని తనతోడి అమ్మలక్కలనందరను పోగు చేసి తిట్టించేస్తుంది. భర్తలు భార్యలను పెండ్లాడి, తల్లులకు అక్కచెల్లెండ్లకి మాయిష్టానుసారము చాకిరీ చేయించుకోమని వప్పచెప్పడం యెంతఅన్యాయము! తరువాత, పురుషు డెంతమందినైన వివాహమాడవచ్చునుగదా: అందు తప్పులేదు. కనుక భార్యకు జబ్బు చేసినను, తనకిష్టము లేకపోయినను, పురుషు డామెను వదలివేసి మరల పెండ్లిచేసుకొనుచున్నాడు. అప్పు డామెగతియేమిటి? పట్టెడన్నముకుకూడకరువుగాదా? భార్యవదలినా భార్యదే తప్పు. భర్తవదిలినా భార్యదే తప్పు. ప్రజలలో నీచకము. ఆడది ప్రపంచములో బ్రతుకుటయెట్లు. స్త్రీజీవితమునకు సుఖమున్నదున్నదా? స్త్రీరజస్వలయేవరకు ప్రపంచకము నొకమోస్తరుగా చూడవచ్చును. తరువాత నేరస్తురాలుగా ఖయిదు చేసేస్తున్నారు. పూర్వ సువాసినులకుతప్ప, మిగిలిన వారికందరికీ ఆజన్మాంతరం ఖయిదుఆలా వుండవలసినదే: 'తప్పు' అందరికి సమానముగాదా? మగవాడు తనవినోదముకొరకు షికారుపోవుటకాని, ఆటలాడుకొనుటగాని చేయవచ్చును. అదే స్త్రీచేసిన మహాపాతకము. ఇంట్లోకావలసిన నీళ్ళుమోయుటకు మైలుదూరమునవున్న చెరువుకైనాపోయి నీరు తేవచ్చును. కాని సాయంకాలము చల్లగాలికైనను వీధిలోకి రాకూడదు. స్త్రీ వీధిలోనికి ఒకప్పుడు వెళ్ళవచ్చును, మరొకప్పుడు వెళ్ళకూడదు. స్త్రీకి తన స్వంత ఆస్తునునది లేదు. చదువు మొదలేలేదుగదా. భర్త, అత్తగారు ఎన్నిబాధలు పెట్టినా పడి వూరుకోవలసినదే. చేయునదేమి లేదుగదా. పయిగా ఎంతబాధపడితే అంతమహాపతివ్రతంటారు !! పురుషుడు అత్తవారింట సర్వవిధములయిన్న గౌరవములుపొందును. ఏమాత్రము గౌరవలోపమయిన్న భార్యనిబాధును. చేతనయిన పనింకేమున్నది? భార్యను పుట్టినింటికిపంపడు. ఇక స్త్రీకి అత్తవారింటి గౌరవములేదు సరిగదా, నడుము విరగకుండా రోజులు వెళ్ళుచున్నచేగొప్ప. తలిదండ్రాది సర్వమువిడచి నీవే దైవమని వచ్చినభార్యకిదా మనముచేయు గౌరవము" ఈవిధముగా 3 ఘంటలు గుక్కతిరగకుండా లెక్చరిచ్చాడు.

౨

రఘునాథరావు easy chair లో పరుండి పేపరు

384

చదువుకుంటున్నాడు. భార్య సుగుణమణివచ్చి 'వంట యినది. స్నానము చెయ్యవచ్చ'ని చెప్పి వడ్డించుటకు వంటయింట్లోకెళ్ళింది. రఘునాథరావు భోజనానంతరము తాంబూలము వేయుచు నిద్రవచ్చుటకు గాను న్యూస్ పేపరు తిరగేస్తున్నాడు. సుగుణమణి నగుమోముతో నిలుచున్నది.

సుగుణమణి:—మీ రేమిటో చదువుచున్నారది నేనుకూడ తెలుసుకొనకూడదా?

రఘు:—ఏదో ఒకటి. నీ కెందుకు? ఆడవాళ్ళకి ప్రపంచకపు సంగతులెందుకు. పాడయిపోతారు. పోయి పనిచేసుకో, పనిలేదా?

సు:—పనా? నిన్ననే కాదా అరబస్తా కందులు కొన్నారు. అవిచాలు, మేము ప్రపంచకము చూడనే కూడదుగదా, అందలిసంగతులేనా విందామని వచ్చాను.

ర:—స్త్రీకిల్లే ప్రపంచకము ఇతరమనవసరము.

సు:—దీని కేమిగాని. ఈవూళ్ళో హార్బరువుందట. చూపెట్టరా?

ర:—సాధ్వీ కిలాటివి తగవు. స్త్రీకి గృహసంరక్షణ, గోసంరక్షణ, దాసీదాని అవసరము లేకుండా గడుపుకొనుట, భోజనమయినతరువాత కందులో, పెసలో, బాగుచేసుకొనుట, మొదలయిన పనులతో కాలము గడపవలెను. యీవూళ్ళో హార్బరుకట్టితే మన కెందుకు: మరొకటికట్టితే మన కెందుకు?

సు:—మీమాటల కేమి లెండి. నేను అనకాపల్లిలో పుట్టి యీవిశాఖపట్నం కాపురంవచ్చేను. వచ్చి 6 యేండ్లయినా యీవూ రెలావుంటుందో యెరుగను. చిన్ననాడెప్పుడు కాలుకొద్దిపరుగెత్తి ఆడుకొన్నానో. కాపురమున కొచ్చినదిమొదలు యిప్పటివరకు సరదా అంటే యేమిటో యెరుగను. దైవమిచ్చిన కండ్లు, కాళ్ళు మీవల్ల నిరుపయోగమయిపోయినవి. మొన్న మీకు 4 రోజులు జ్వరంవచ్చి యింట్లోవుంటే, వీధిలో కెళ్ళిందాకా తోచదనేవారే, నాకుమాత్ర మాలావుండదా? నే నీప్రపంచకములో జన్మించు టెందుకు?

ర:—రాజ్యమేలేటందుకు.

సు:—ఏరాజ్యము?

ర:—గృహరాజ్యము.

సు:—యీరాజ్యములో రాణికి ఖైదే కాబోలు.

ర:—బియ్యములో బెడ్డలేరుట, పెసలు మినుములు బాగుచేయుట అంట్లు బాగావదలేటట్లు తోముట, యీలాటి రాజకీయవ్యాపారము లనేకము లున్నవి. అవన్ని ఏరోజువారోజకే సరిపోతాయి. సంకెళ్ళువెయ్యకపోతే యివన్ని సరిగ్గాజరగవు.

సు:—అత్తగారు, మీ రుత్తవెధవముండలండీ, అన్నట్లు బాగానేచెప్పారు. మేము పుట్టుట అంట్లు తోముటకు, యిల్లలుకుటకు, పిల్లలను కనుటకేనా? మీ మాటలు చూస్తే బానిసలమని అర్థమిస్తుంది.

ర:—బానిసకూడా కాదు. మాయింట్లో వంటకు గిన్నెలు చెంబులు ఏలాకొనుక్కున్నామో, ఆవిధముగానే యింట్లోపనిచేయు Machines క్రింద దేవుడు మిమ్మల్ని పుట్టించినాడు.

సు:—అయితే యింక భార్యాభర్తలకు ప్రేమ అక్కరలేదా? వాళ్లయిందిరను వెంగుణ్ని చూడండి. ఎంత అన్యోన్యంగావుంటారో.

ర:—వాడా! వుత్తవెధవ. కాకపోతే ఆడదానికా కీ కార్లేమిటి! అది ఆడిందల్లా ఆట పాడిందల్లా పాట. ఇద్దరు కుర్చీలలో కూచుని గుసగుసలు. భోగందానిలాగ షోకులు, ఆనగలు, పిల్లనెత్తుకొనుటకు పిల్ల, వంటామిడ! పనిమనిషి! క్రిందఅడుగువేస్తే అరిగిపోతుందంటాడు. వెంగవెధవకి బుద్ధివుంటే ఆలాబరితెగించిపోతుందా? సరిగా పనిచెయ్యకపోతే తన్నడమే నాకు ప్రేమ. మాతాత ఏమిచేసేవా డనుకున్నావు? మా అమ్మమ్మని: కొడితే పడిమిరిగేది. పక్షంరోజులుదాకా వేసినసున్నప్పట్టు వేసినట్టేవుండేది.

385

సు:—మీ రేమగవారు. యేమిచేసినా అడిగే వారులేరు. మీ నాన్నగారు కొంచెం నయమనుకుంటాను.

ర:—నీవు నోరుమూసుకుని అయినవాళ్ళతోను కానివాళ్ళతోను స్నేహాలు చెయ్యక యింట్లో పడివుండు, లేదా పాదరక్షాప్రయోగంతప్పదు.

సు:—ఇన్నాళ్ళనుట్టి కాపురం చేస్తున్నా మీ రింత కఠినహృదయులని కనిపెట్టలేకపోయితిని. ఈ సంగతి మీతో చెప్పుదామని ఎన్నాళ్ళనుట్టో మనస్సులోవుంది కాని భయపడి వూరుకున్నాను. బ్రతికేది కొద్దికాలము. మీమాటలవల్ల ఈజీవితమునకింక ప్రపంచకములో కన్నులారచూచేవి ఆనందించేవి లేవు. 6 సంవత్సరములనుండి చూస్తున్నాను. ఈమూడు గదులు ఎలక్కన్నములు అనుభవించేదేమంటే మీచేత చెప్పుదెబ్బలు. పరలోకం ప్రయాణం త్వరలో చేస్తే యీబానిసత్వంవదలి మనవాళ్ళు చెప్పేటట్లు జీవుడైనా సుఖ మనుభవిస్తుందేమో?

ర:—చస్తేచావు. నోటికి నిరిలేకపోతేసరి. కూచోబెట్టి మేపుతుంటే బానిసత్వమయిందా? చదువుకున్న పిల్ల కాపురంచేస్తుందా. మాఅమ్మనివద్దంటే కట్నం కోసం నాకు నిన్ను కట్టిపెట్టింది.

సు:—ఈరోజున స్త్రీసమాజములో స్త్రీలపక్షమున, స్త్రీస్వాతంత్ర్యము, ఘోషానుగురించి లెక్చరిచ్చారట గాదా? అక్కడ అలాగు చెప్పడం, యింటి దగ్గర యీలాగు చేయడమూనా?

ర:—ఈవిషయం నీకేలాగున తెలిసింది?

సు:—ఇందిర చెప్పింది.

ర:—అయ్యో నీ మొహంమండ! దరిద్రపుముండా! ఏదో వాళ్ళుచెప్పమంటే అలా చెప్పానుకాని అది అంతా నీకోసం అనుకొన్నావా? కాని స్నేహములు చేసి చెడుతున్నావా ముండా?

అంటూ నాలుగుగుద్దులుగుద్ది యింకా కోపంతీరక అప్పడాలకఱ్ఱ విసరివేసెను. అది సుగుణకాలుకు తగిలి రక్తం చిమ్మతోంది. చావు, ముండా! అంటూ రఘునాథరావు తలుపుచేరవేసి వీధిలోనికి వెళ్ళిపోయెను.

3

కొంతసేపటికి విమలవచ్చి తలుపుతట్టింది. సుగుణ తలుపుతీసి ఆమెను మర్యాదచేసి కుర్చీమీద కూర్చోమంది.

విమల:—ఏమే? కాలు కట్టుకట్టావు?

సు:—ఏమీలేదు దెబ్బతగిలింది—విశేషము లేమన్నా ఉన్నాయా?

వి:—శీలవతి, సుగుణాలవాల, ఆయిందిరనుగురించి ఎట్లు ప్రజలు చెప్పుకుంటూన్నారో! అట్లుడికినట్లు;

సు:—ఏమని?

వి:—దానికి జబ్బుచేసిందిగా! శరీరారోగ్యమునకు సముద్రతీరమునకు వాకిటు వెళ్ళమని డాక్టరు చెప్పినాడట. పాపమది, ప్రజలు బతుకనివ్వరు, నేను వెళ్ళను, అందిట. కాని భర్త పట్టుబట్టి పంపినాడట. అది ఇప్పటినగలు పెట్టుకుంటుంది. ఇంకా "ఒప్పులకుప్ప" "దాగుడుమూతలు" యిలాంటి ఆటలంటే దానికి సరదా! ఇదేతప్పట!

సు:—గొప్పతప్పే! దీనితో చెడిపోయిందా? దాని పాతివ్రత్యము. పూర్వము శకుంతల, దమయంతి, మున్నగువారు చెలికత్తెలతో ఆడుకున్నట్లు మనగ్రంథములలో లేదూ? ఇప్పుడు ఈచెప్పుకొనేవారంతా వారిని పతివ్రతల లిస్టులోనుంచి త్రోసివేశారా?

వి:—ఆచరణలోనున్న పాతివ్రత్యానికి గ్రంథస్థమైనదానికి సహస్రం తేడావుంది. ప్రస్తుతము మన అమ్మలక్కలు కొందరు అన్నీ వేషభాషలలోనే ఉంటాయి, అంటాడు.

సు:—మంచి హృదయంలో ఉంటుందికాని బట్టలోను బొట్టులోను ఉంటుందా? భారత నారీమణుల బాధలు ఎప్పుడు తీరునో?

(విమల నిష్క్రమించెను.)

386

౪

మఱునాడు రఘునాథరావు షైరువెళ్లి తిరిగివచ్చి తలుపు తట్టుసరికి ప్రత్యుత్తరములేదు. త్రోయగా తలుపు వేసియుండకపోవుటచే తెఱచుకొంది. సుగుణమణి ఎలెక్ట్రిక్ పంకాక్రిందపడియుంది. నిన్న కొట్టినందుకు కోపగించి పడుకొందేమో అనుకొన్నాడు. సమీపించి తట్టుసరికి—ఇంకేమేముంది? కాళ్లుచేతులు చల్లబడి సుగుణమణి జీవరహితకాయము కొయ్యబారి ఉంది.

"అన్నంతపనీ చేశావే!" అంటూ కూలబడ్డాడు. ప్రక్కనున్న చిన్న ఉత్తరమును చూచి ఆత్రపాటుతో చదివినాడు. అందిట్లుండెను.

ప్రాణనాథా!

మీరు నాకొఱకు విచారించవలదు. బానిసత్వపు విముక్తికై ఎందరు ధీరులు ప్రాణములు కోల్పోలేదు!! నేను స్త్రీసంఘపు బానిసత్వవిముక్తికై నా ప్రాణము లర్పించితిని. నామీద మీకు ప్రేమయున్నచో నా తుదికోరిక తీర్చకోరెను. తమరు ఒకపక్షముదినములు గదిలో తలుపువేసికొని కూర్చుని ఎట్లుండునో మీ సోదరులకు చెప్పుడు. స్త్రీలకు సహిత మిట్టిఖైదుల మాన్పించుడు.

ఇక సెలవు,
సుగుణమణి.

రఘునాథరావు భార్యకోరిక తీర్చాడు. పక్షము దినములు అయినతర్వాత బయటకువెడితే ప్రపంచమంతా క్రొత్తఅయింది. సంఘసంస్కరణకై ప్రాణము లర్పించిన సుగుణమీదప్రేమ కిందమారిపోయింది. ఉపన్యాసములు జోరయ్యాయి. సంఘసంస్కర్త అయ్యాడు రఘునాథరావు.

సుగుణశవము ఏవిధమైన ఘోషాలేకుండా సముద్రతీరమున దహనము చేయబడెను. ఆనాడే గడపదాటరాదనుశాస్త్ర మిక్కడ రద్దుచేయబడెను. సుగుణ కోరికయు, బ్రతికియున్నప్పుడు పొందని బీచిషైరు నేటికి చేకూరెను.

హాయిగా మలయమారుతములు వీచుచున్నవి. సముద్రుడామెకు అంత్యగీతములు పాడుచున్నాడు. సుగుణమాత్రము నేటికిని మృతజీవురాలే.

సంతుష్టో భార్యయా భర్తా
భర్త్రా భార్యా తథైవచ,
యస్మిన్నేవ కులేనిత్య
కళ్యాణం తత్రవై ధ్రువమ్.

మనువు.